


# మనం




తూర్పు, పశ్చిమ, కృష్ణాజిల్లాలు

గురువారం 31-10-2024

4 పేజీలు


# దీపం-2 పథకం

# ఉచిత గ్యాస్ సబ్సిడీ నిధులు విడుదల




- దీపావళి కానుకగా అమల్లోకి సూపర్ సిక్స్ ఉచిత సిలిండర్ల పథకం
- దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మొదటి విడతకు అయ్యే ఖర్చు రూ.894 కోట్ల మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందజేసిన సిఎం చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర

ఆహారం,పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు శ్రీ నాదెండ్ల మనోహర్

## నిన్నటి నుంచి అమల్లోకి దీపం -2 పథకం

- 1వ తేదీన శ్రీకాకుళంలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

విజయవాడ అక్టోబర్ 30 మనం ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీల్లో భాగమైన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి అవసరమైన సొమ్మును ప్రభుత్వ రంగ గ్యాస్ కంపెనీలకు చెల్లించారు. రాష్ట్రంలో ఉన్న 1.47 కోట్ల రేషన్ కార్డుదారులకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తారు.ఏపీలో దీపావళి కానుకగా సూపర్ సిక్స్ ఉచిత సిలిండర్ల పథకాన్ని అమల్లోకి తీసుకు వచ్చారు. మంగళవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంలో సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. దీపం-2 పథకానికి రూ.2,684 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, మొదటి విడతకు అయ్యే ఖర్చు రూ.894 కోట్ల మొత్తాన్ని పెట్రోలియం సంస్థలకు అందచేశారు.

## జగ్గయ్యపేట రామాలయంలో పూజా

## కార్యక్రమాల్లో పాల్గొన్న సామినేని ఉదయభాను





### నేతలతో కలిసి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

జగ్గయ్యపేట అక్టోబర్ 30 మనం న్యూస్ జగ్గయ్య పేట పట్టణంలోనీ చరిత్ర ప్రాశస్తం గల ధన శైల రామాలయం ( పెద్ద రామాలయం) లో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన సామూహిక లక్ష్మీ కుబేర వ్రతాల లో మాజీ ప్రభుత్వ వి ప్ జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొని లక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వచనాలను అందించారు. అనంతరం తాను శాసన సభ్యునిగా ఉన్నప్పుడు పెద్ద రామాలయం దేవస్థానం అభివృద్ధి కొరకు కేటాయింపు చేయించిన రూ. 1.18 కోట్ల నిధులతో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర రావు , ఎన్టీఆర్ జిల్లా ఆర్య వైశ్య ప్రముఖులు బొగ్గవరపు రాజా కొత్తా పురుషోత్తం , మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండా , తుమ్మేపల్లి వేంకటేశ్వరరావు , వెన్నా ప్రశాంత్ గ మరియు సామినేని లక్ష్మీ నారాయణ తదితర ప్రముఖులు నేతలు పాల్గొన్నారు.

## జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని కలిసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట అక్టోబర్ 30 మనం న్యూస్ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎత్తిపోతలపథకాలను పునః ప్రారంభించాలని కోరుతూ తెలుగుదేశం నేతలు రైతులతో కలిసి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ కలసి కోరారు. విజయవాడలో జల వనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రైతు నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంత్రి నిమ్మల రామానాయుడు ని కలిసి జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి పలు ఎత్తిపోతల పథకాలపై మంత్రికి వివరించారు. గత ప్రభుత్వ హాయంలో నిలుపుదల చేసిన ముక్త్యాల ఎత్తి పోతల పథకం తిరిగి పునః ప్రారంభించాలని, కంచల- వేదాద్రి ఎత్తిపోతల పథకం మేజర్ రిపేర్లు వెంటనే చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని, పోలంపల్లి డ్యామ్ ప్రాజెక్ట్ క్రొత్త డిజైన్ సక్రమంగా లేనందున పాత డిజైన్ ప్రకారం నిర్మాణం పూర్తి చేసి రైతులకు మేలు చేసే విధంగా వెంటనే పనులు చేపట్టాలని, ఈ మూడు పథకాలకు సంబంధించి వెంటనే నిధులు మంజూరు చేయాలని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు రైతు ప్రతినిధులువేగినేటి గోపాలకృష్ణమూర్తి, పొన్నం నరసింహారావు, విశ్వనాథం, బాలాజీ, కృష్ణారావులు పాల్గొన్నారు.



## పశ్చిమగోదావరిజిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, అక్టోబర్ 30, మనం బ్యూరో: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటామన్నారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందంగా గడపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. భగవంతుని ఆశీస్సులతో ఈ దీపావళి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికి జిల్లా కలెక్టర్ హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు

## ప్రతి కుటుంబం ఆనందోత్సవాలలో దీపావళి పండుగను జరుపుకోవాలి

### మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు, అక్టోబర్ 30, మనం ప్రతినిధి:దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర, పాలకొల్లు నియోజక వర్గ ప్రజలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు శుభాకాంక్షలు తెలియ జేశారు. రాష్ట్రంలో జగన్ ఐదేళ్ల రాక్షస, నిరంకుశ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడి ఎన్డీఏ ప్రభుత్వానికి పట్టం కట్టిన రాష్ట్ర ప్రజలందరూ చెడుపై సాధించిన మంచి విజయానికి గుర్తుగా ఈ దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటామన్నారు. చీకటి నుంచి కాంతులు విరజిమేలా పిల్లలు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా జరుపుకునే ఈ పండుగ సమయంలో కుటుంబ సభ్యులందరూ ఆనందంగా గడపాలని భగవంతుని ఆశీస్సులతో ఈ దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలకు అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆ మంత్రి రామానాయుడుఆకాంక్షించారు.

# చేతివృత్తిదారులను ఆదుకుందాం

## వాతావరణ కాలుష్యం లేని వెలుగుల దీపావళిని జరుపుకుందాం



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 30 మనం ప్రతినిధికొండపల్లిలోని క్రాంతి హై స్కూల్ 8 వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు దీపావళి సందర్భంగా చేతి వృత్తిదారులు తయారు చేసే ప్రమిదలను వారి వద్ద నేర్చుకొని స్వయంగా తయారు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు, చేతివృత్తుల పట్ల అవగాహన కలిగించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. పది సంవత్సరాల క్రితం కొండపల్లిలో సుమారుగా వందకు పైగా కుమ్మరి చక్రాలు పనిచేస్తూ ఉండేవి ఇప్పుడు కనీసం ఒకటి రెండు కూడా పనిచేయడం కష్టంగా ఉంది విద్యార్థులకు నేర్పించాలనే ఉద్దేశంతో కుమ్మరి కళాకారులను కోరడం జరిగింది. అందువలన తప్పనిసరిగా అందరూ చేతి వృత్తిదారుల వద్ద ప్రమిదలను కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా సహాయం చేయడమే కాకుండా ప్రోత్సహించవలసిందిగా కోరారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో దీపావళి తర్వాత ఒక పది రోజులు వాయుకాలుష్యం వలన పొల్యూషన్ హాలిడేస్ పేరిట విద్యాసంస్థలకు సెలవులు ఇస్తున్నారు. ఇదే పరిస్థితి మిగిలిన పట్టణాలలో కూడా వచ్చే అవకాశం ఉంది దీని నుంచి తప్పించుకోవాలంటే అందరూ తప్పనిసరిగా ఏ విధమైన కాలుష్యం లేని వెలుగులతో నిండిన దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా మూగజీవులను, పెంపుడు జంతువులను, వృద్ధులను పసిపిల్లలను దృష్టిలో పెట్టుకొని శబ్ద కాలుష్యం లేకుండా చూడాలని తెలియజేశారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్రమిదలను రంగులతో అందంగా అలంకరించి ప్రైమరీ తరగతుల విద్యార్థుల విద్యార్థులకు పంపిణీ చేశారు.

# గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి

## ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న....



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 30 మనం ప్రతినిధిగ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి తుమ్మలపాలెం గ్రామంలో బీసీ కాలనీ నందు 25 లక్షల అంచనాలతో సిసి రోడ్లకు సర్పంచ్ భూము వెంకటరమణ తో కలిసి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చొరవ తో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితునికి వివిఎస్ విద్యార్థులు ఆర్థిక సహాయం.



యు కొత్తపల్లి(అక్టోబర్ 30) మనం న్యూస్ : గ్రామానికి చెందిన బోయి మధు (30)రెండు కిడ్నీలు పాడై గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యం తో బాధపడుతూ డయాలసిస్ కూడా చేయించుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మా వి వి యస్ విద్యార్థులు తమ వంతు సహాయంగా వారి వైద్య ఖర్చుల నిమిత్తము 10,000/- రూపాయలను బాధితునికి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భముగా విద్యార్థులు మానవతా దృక్పథంతో స్పందించిన తీరును వి వి యస్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మరియు టీచర్స్ విద్యార్థులను అభినందించారు.

# ఏ ఈ ఈ వెంకటేశ్వర్లు సేవలు స్ఫూర్తిదాయకం

## డి పి ఆర్ ఓ టి.నాగేశ్వరరావు



భీమవరం, అక్టోబర్30, మనం బ్యూరో.కలెక్టరేటు ప్రాంగణంలోని డి పి ఆర్ ఓ కార్యాలయంలో పనిచేసి పదవి విరమణ చేసిన అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగళ్ళమూడి వెంకటేశ్వర్లు పదవి విరమణ అభినందన సభకు డి పి ఆర్ ఓ తలుపులు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు సమాచారం శాఖలో 33 సంవత్సరాలు సేవలందించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. నిబద్ధతతో పనిచేసిన ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. 1992వ సంవత్సరంలో ఏలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరు కార్యాలయంలో రేడియో టెక్నీషియన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు అనంతరం కాకినాడ, రాజమండ్రి కార్యాలయాలకు రేడియో టెక్నీషియన్ గా బదిలీ అయ్యారు. తదుపరి రాజమండ్రి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరు కార్యాలయంలో అసిస్టెంటు ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా పదోన్నతి పొందారు. అక్కడనుండి అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా ఏలూరుకు పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరుగా రాజమండ్రి, కాకినాడలో బాధ్యతలు నిర్వహించారు. జిల్లా విభజన అనంతరం భీమవరం డి పి ఆర్ ఓ కార్యాలయమునకు బదిలీపై వచ్చిన అసిస్టెంటు ఇన్ఫర్మేషన్ ఎన్.వెంకటేశ్వర్లు నేడు స్వచ్ఛంద పదవీ విరమణ అయ్యారు. 33 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని ప్రభుత్వానికి సేవలు అందించిన యన్.వెంకటేశ్వర్లుకు సమాచార శాఖ అధికారి టి. నాగేశ్వరరావు, సిబ్బంది సత్కరించి, జ్ఞాపికను అందించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు కె. సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ, ఆర్.ఎ డి.సోమరాజు, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశాలి, పి.వై.రత్నాకర్, తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లకు అభినందనలు తెలిపారు.

## అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులకు

# ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా జాబ్ డ్రైవ్



మైలవరం అక్టోబర్ 30 మనం న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎ పి ఎస్ ఎస్ డి సి), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ – సీడాప్, విజయవాడ సంయుక్త అద్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను లకిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ కళాశాల, మైలవరం నందు "జాబ్ మేళా" నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు(ఎఫ్ ఎం సి) మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేసారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు(ఎఫ్ ఎం సి), జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధ్వర్యంలో ఈ జాబ్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నామని మరియు ఉద్యోగం చిన్నదా, పెద్దదా అన్న అపోహను యువత పెట్టుకోవద్దని, ఉద్యోగం చేసుకుంటూ వెళ్తే అదే ఆ వ్యక్తులను ఉన్నత స్థితికి తీసుకెళ్తుంది అని తెలిపారు. ఈ జాబ్ మేళ లో ముత్తూట్ ఫైనాన్స్, కే ఎల్ గ్రూప్స్, జస్ట్ డైల్ కంపెనీ వారు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని వారు తెలిపారు. మొత్తంగా 14 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వారిలో 6 మంది ఎంపిక అయ్యరు అని తేలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ళ రవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణ పాఠశాలలో దీపావళి సంబరాలు



మైలవరం అక్టోబర్ 30 మనం న్యూస్:స్థానిక నారాయణ పాఠశాలలో దీపావళి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అందరూ దీపాలు వెలిగించారు. నారాయణ స్కూల్ ఏజీఎం హరీష్ బసవరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నకుమారి చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే పండుగ గురించి మాట్లాడుతూ పిల్లలందరికీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఛాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ మనీషా, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఏవో దివ్య, డీన్ స్యాంసన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కోరలు చాస్తున్న కాలుష్య భూతం

## నేటి దొంగలే నాడు దొంగా... దొంగా... అని అరచిన వైనం







ఇబ్రహీంపట్నం అక్టోబర్ 30 మనం ప్రతినిధిదొంగే దొంగా దొంగా అంటూ అరచినట్లుంది వి టి పి ఎస్ బూడిద వ్యవహారం. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంత గ్రామాలు గత ప్రభుత్వ హయాంలో కాలుష్యమయమవుతున్నాయంటూ అంటూ గగ్గోలు పెట్టిన వారే ఇప్పుడు కాలుష్యానికి మరింత కారణమవుతున్నారని ఆరోపణలున్నాయి. గడచిన ఐదేళ్లలో ఇబ్రహీంపట్నం నార్ల తాతారావు థర్మల్ పవర్స్టేషన్ నుండి పైపుల గుండా కొండపల్లి ఖిల్లా కు వెళ్లే దారిలో గల బూడిద చెరువులో కలవాల్సిన బూడిద ను గత ప్రభుత్వంలోని స్థానిక నాయకులు వీటీపీఎస్ అధికారులతో కుమ్మక్కై పైపుల బోల్టులను ఉద్దేశపూర్వకంగా తొలగించి ఇబ్రహీంపట్నంలోని ఏ కాలనీ, సెక్యూరిటీ కాలనీ కాలువలలో బూడిదలు నింపుకొని సొమ్ము చేసుకుంటున్నారని, ఇబ్రహీంపట్నం ప్రజలు మాత్రం కాలుష్య కోరల్లో కొట్టుమిట్టాడుతున్నారని కాలుష్యం పేరుతో గగ్గోలు పెట్టిన వారే ఇప్పుడు కాంట్రాక్టుల పేరుతో అదే పని చేస్తున్నారని ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆనాడు నాయకులు వి టి పి ఎస్ అధికారులతో కుమ్మక్కై కాలుష్యానికి పాల్పడుతున్నారని ఆరోపించిన మాజీ రౌడీషీటర్ అనుచరులలో ప్రధాన సభ్యుడు నేడు కాంట్రాక్టుల పేరుతో అదే పని చేస్తుండటంతో మరి ఈరోజు బోల్టు లు తీయనిదే కాలువలు ఎట్లా నిండుతున్నాయని స్థానికులు గుసగుసలాడుతున్నారు.

# కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యం







- ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య
- గంగ్రాయిలో తెలుగుదేశంపార్టీ సభ్యత్వానికి విశేష స్పందన

జగ్గయ్యపేట అక్టోబర్ 30 మనం న్యూస్కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు మండలంలోని గంగ్రాయి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట మండలం గంగ్రాయి గ్రామంలో మండల, గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్యపాల్గొని ముందుగా అన్న నందమూరి తారక రామారావు చిత్రపటానికి కొబ్బరికాయ కొట్టి, పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ సభ్యత్వ నమోదుకువిశేష స్పందన లభించింది సభ్యత్వ నమోదు ప్రారంభించినగంటల వ్యవధిలోని 300 సభ్యత్వాలు నమోదయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ నాయకులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూటిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట స్పందన లభిస్తుందని అన్నారు. కార్యకర్త సంక్షేమమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ లక్ష్యమని అన్నారు. భీమా తో కూడిన సభ్యత్వం నమోదు కార్యకర్తల జీవితానికి భరోసా ఇస్తుందన్నారు. కేవలం రూ. 100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి 5 లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తిస్తుందని కార్యకర్తల విద్య, వైద్యం ఉపాధి కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు,కొఠారు సత్యనారాయణ ప్రసాద్, పల్లెబోయిన నాగరాజు, కనపర్తి చిట్టిబాబు,ముండ్లపాటి శరత్ బాబు, శీతల శ్రీను, వైకుంఠపు అమరబాబు, కొరివి సత్యనారాయణ, అమరబోయిన పోతురాజు, బండారుపల్లి వెంకటయ్య, చిట్టూరి శివకుమారి, జడ రామకృష్ణ, పిడతల శివ, కొత్తపల్లి ఏడుకొండలు, బాజినేని రవి, మైదాసు కృష్ణయ్య, ఆళ్ల వెంకన్న, షేక్ షాజహాన్, వేదులపురం హుస్సేన్, కొత్తపల్లి పుష్పరాజు, కొరివిశ్రీను, రమేష్, దేరంగుల హరి, ధారా రవి, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 400 పవర్ స్ప్రేయర్ పంపులను పంపిణీ చేసిన దాల్మియా భారత్ ఫౌండేషన్



పర్యావరణ అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించడం మరియు వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి రైతులను అధునాతన సాధనాలతో శక్తివంతం చేయడం లక్ష్యంగా ఉంది



గాంధీనగర్ అక్టోబర్ 30 మనం న్యూస్: పర్యావరణ ఎడిషన్ అనుకూల వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే దిశగా దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ (డిసిబిఎల్) యొక్క కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) విభాగం దాల్మియా భారత్ ఫౌండేషన్ (డిబిఎఫ్), 400 పవర్ స్ప్రేయర్ పంపులను కడపలో తమ ప్లాంట్ కు సమీపంలోని గ్రామాలలోని రైతులకు పంపిణీ చేసింది. మెరుగైన పంట రక్షణ కోసం తాము చేపట్టిన కార్యక్రమాల రెండవ దశలో భాగంగా ఈ పంపిణీ చేసింది. ఈ కార్యక్రమం ద్వారా వ్యాధులు మరియు తెగుళ్ళ వల్ల కలిగే పంట నష్టాన్ని నియంత్రించడం, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం మరియు రైతులకు ఇన్ పుట్ ఖర్చులను తగ్గించడం లక్ష్యంగా చేసుకున్నారు. డిబిఎఫ్ తమ ప్రతిష్టాత్మక గ్రామ్ పరివర్తన్ ప్రాజెక్ట్ కింద, ఆహార భద్రతను పెంచడానికి, రైతు జీవనోపాధిని మెరుగుపరచడానికి మరియు మరింత పర్యావరణ నాయకత్వాన్ని మెరుగుపరచడానికి స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి కట్టుబడి ఉంది. ఈ పంపిణీ 1,000 ఎకరాలకు పైగా ఉన్న వ్యవసాయ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంది, ఇది ఆరోగ్యకరమైన దిగుబడిని ప్రోత్సహిస్తుంది మరియు తెగులు ముట్టడి కారణంగా పంట నష్టాలను తగ్గిస్తుంది. ఈ కార్యక్రమంలో 193 ఫోర్-స్ట్రోక్ పవర్ స్ప్రేయర్స్ మరియు 207 బ్యాటరీతో పనిచేసే స్ప్రేయర్స్ అందించటం జరిగింది, మిరపకాయ మరియు సెనగ వంటి పంటలలో రైతులు చీడపీడల నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది. ఈ ప్రాజెక్ట్ విలువ రూ. 20 లక్షలు, ఆధునిక వ్యవసాయ పరిష్కారాలతో రైతులను శక్తివంతం చేయడానికి డిబిఎఫ్ యొక్క నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది. డిబిఎఫ్ ఈ కార్యక్రమానికి రూ. 8,89,500 అందజేయగా లబ్ధిదారులు రూ. 13,55,500 అందజేశారు. ఈ కార్యక్రమం పై కడప యూనిట్ హెడ్ ముఖేష్ కుమార్ సిన్హా మాట్లాడుతూ, "రైతులు తరచుగా ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం, వనరులు మరియు సహాయక వ్యవస్థలకు చేరువకాలేరు . దాల్మియా భారత్ వద్ద, అధునాతన వ్యవసాయ వ్యవసాయం కార్యక్రమాల ద్వారా చిన్న మరియు సన్నకారు రైతులను శక్తివంతం చేయడానికి మేము అంకితభావంతో ఉన్నాము. రైతులకు సమర్థవంతమైన, పర్యావరణ అనుకూలమైన పంట నిర్వహణ పద్ధతులను అందించటం ద్వారా స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం మా లక్ష్యం " అని అన్నారు.




# గోద్రెజ్ రాషిన్‌బాన్ తో మిరప రైతులకు భరోసా

గాంధీనగర్ అక్టోబర్ 30 మనం న్యూస్: మిరప మొక్కలో కీలకమైన ఆర్థిక భాగమైనందున, మిరప సాగులో పువ్వులు విజయానికి అత్యంత కీలకం. ఈ కీలకమైన వాస్తవాన్ని గుర్తించి, ఈ కీలకమైన మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూత సమయం అంటే రాషిన్‌బాన్ సమయమని జిఏవిఎల్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ ఎన్.కె. రాజవేలు పేర్కొన్నారు. పంట నాటిన 45-75 రోజుల వద్ద రాషిన్‌బాన్ ఉపయోగించినప్పుడు, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది ఒకసారి వినియోగిస్తేనే తామర పురుగు (త్రిప్స్), లెపిడోప్టెరాన్స్, పచ్చ దోమ (హాప్పర్స్), నల్లి (మైట్స్)తో సహా అనేక రకాల కీటకాలను నాశనం చేస్తుంది. శాస్త్రీయ విధానాన్ని అవలంబించడం ద్వారా గ్రాసియాతో ప్రారంభించి, రాషీన్‌బాన్ తో నాటిన 45-75 రోజుల యొక్క క్లిష్టమైన దశలో మిరప పంట పువ్వులను రక్షించడం ద్వారా మిరప రైతులు ఆరోగ్యకరమైన, చీడపీడలు లేని పంటలు, మెరుగైన దిగుబడులు, ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చు" అని రాజవేలు తెలిపారు.

# శ్రీ చైతన్య లో దీపావళి వేడుకలు






తాడేపల్లిగూడెం అక్టోబర్ 30 మనం న్యూస్ : స్థానిక హౌసింగ్ బోర్డ్ వద్ద గల శ్రీ చైతన్య దేరెసిడెన్షియల్ స్కూలు నందు విద్యార్థులచే ముందస్తు దీపావళి పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగినవి.సంస్కృతి,సాంప్రదయాలతో ప్రాంగణం మొత్తం మామిడితోరణాలతో,రంగవల్లులతో ముస్తాబు చేశారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు అలరించారు.ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమం లో శ్రీ చైతన్య విద్యార్థులు,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.తొలుత ప్రైమరీఇంచార్జి రజని విద్యార్థులచే ధనలక్ష్మి దేవి పూజాకార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మన భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందే పండుగ ఈ దీపావళి అని,చెడుపై మంచి సాధించిన విజయంగా మనసంస్కృతి తెలుపుతుందని సంస్థల ఏ.జి.ఎం.పార్థసారధి విద్యార్థులకు తెలిపారు.చీకటిని పారద్రోలి మనందరి జీవితాల్లోకి వెలుగు నింపే పండుగ సందర్భంగా మనంమతాబాలు, చిచ్చిబుడ్లు, తారాజువ్వలు, బుచక్రాలు వంటివి పెద్దల సమక్షంలోనే కాల్చాలని,మనం ఆ సమయంలో ఎటువంటి దుస్తులు ధరించాలి,అత్యవసరంగా అందుబాటులో ఉంచుకోవలసిన వస్తువులు గురించి విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు బాణాసంచాను సాధ్యమైనంత తక్కువగా కాల్చి ప్రకృతిని కాలుష్యరహితంగా ఉంచేవిధంగా నేటి విద్యార్థులు ప్రయత్నం చేయాలని హాస్టల్ ప్రిన్సిపాల్ ఆకుల.రాంప్రసాద్ అన్నారు.కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ ఇంచార్జి సలీమా,డీన్ మూర్తి,సి ఇంచార్జి రాము విద్యార్థినీ,విద్యార్థులు మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.కార్యక్రమ అనంతరం విద్యార్థులతో స్కూల్ ఏ.ఓ గంగరాజు,స్టోర్ ఇంచార్జి ఆదిత్య విద్యార్థులతో తగిన జాగ్రత్తలతో దీపావళి బాణసంచా ఉత్సవంగా నిర్వహించారు.

# రైతు నష్టపోకుండా మనం కాపాడుకోవాలి





**163 మంది కార్యదర్శులకు 19.19 లక్షలు బోనస్ పంపిణీ చేసిన**

**విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు**

హనుమాన్ జంక్షన్ : అక్టోబర్ 30 మనం ప్రతినిధిపాల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగుల సమష్టి కృషి వలనే విజయడైరి అభివృద్ధి సాధ్యమైందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు.వ్యవస్థ బాగుంటేనే మనమందరం బాగుంటామని అన్నారు. అహర్నిశలు శ్రమించేరైతు నష్టపోకుండా మనం కాపాడుకోవాలి అన్నారు. సామాజంలో మార్పు రావాలి మనందరం కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పాల రైతును మనం కాపాడుకోవాలనీ, అప్పుడే సంస్థ మనుగడకు డోకా ఉండదన్నారు.. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోనీ వేతన కార్యదర్శులకు బుధవారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లో బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ దేశంలోనే రైతులకు అధిక ధర ఇస్తున్న ఘనత విజయడైరీకి దక్కుతుందన్నారు.. ముందుచూపుతో వీరవల్లితో నిర్మించిన కొత్త ఫ్యాక్టరీ వలన మొన్నటి వరదల వల్ల విజయవాడ లో పాల ఫ్యాక్టరీ మునిగిపోయినా రైతులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చేయగలిగామని చెప్పారు. కార్యదర్శులు మరింత అంకిత భావం తో పని చేయాలన్నారు.. హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని163 సంఘాలలో వేతన కార్యదర్శులకు 19.19 లక్షల రూపాయల బోనస్ చైర్మన్ చలసాని చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు ను, మేనేజర్ హరిబాబు ను పలువురు వేతన కార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివ జ్యోతి , ట్రస్ట్ డైరెక్టర్ పిన్నమనేని లక్ష్మీ ప్రసాద్ , వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లింగం ప్రసాద్ , హనుమాన్ జంక్షన్ పాలశీతల కేంద్రం మేనేజర్ మాగంటి హరిబాబు, సూపర్ వైజర్ లు, వెటర్నరీ డాక్టర్లు , సేమన్ వర్కర్స్ , సిబ్బంది పాల్గొన్నారు.

# డ్వాక్రా సంఘాలకు మరింత చేయూతనిస్తాం




**వచ్చే ఐదేళ్లల్లో పేదల ఆదాయం రెట్టింపు చేసేలా ప్రణాళికలు**

**పేదరిక నిర్మూలనకు నిజమైన లబ్ధిదారుల ఎంపికకు ఎస్ హెచ్ జి ప్రొఫైలింగ్ యాప్ తోడ్పాటు**

**జనవరి నుంచి అమరావతి రాజధాని పనులు**

**రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ**



విజయవాడ అక్టోబర్ 30 మనం ప్రతినిధి : పేద ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేయాలంటే ప్రజల స్థితిగతులపై పూర్తి సమాచారం ప్రభుత్వం వద్ద ఉండాలని, అప్పుడే ఆశించిన ఫలితాలు సాధించగలమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. మహాత్మా గాంధీ రోడ్డులోని అమరావతి కన్వెన్షన్ హాల్ లో మెప్మా స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్ పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ వర్క్ షాపుకి మంత్రి పి. నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ డ్వాక్రా, మెప్మా సంఘాల సభ్యులకు సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తారని... వారి ఆర్థిక పరిస్థితి బాగుంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బాగుపడుతుందని బలంగా నమ్ముతారన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆదాయం రెట్టింపు కావాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అందుకు అనుగుణగా మెప్మాలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకుని అమలు చేస్తున్నామన్నారు.ప్రభుత్వం అందించే పథకాలు సక్రమంగా పేద ప్రజలకు చేరువ కావాలంటే డేటా ప్రొఫైలింగ్ ఎంతో అవసరమన్నారు. సభ్యుల డేటా ఆధారంగా ఎవరెవరికి ఎలాంటి పథకాలు, ప్రభుత్వం అందించాలనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. గత ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ను నిర్లక్ష్యం చేసిందన్నారు. పేదల కోసం తలపెట్టిన టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు అందించలేదన్నారు. ప్రొఫైల్ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల డేటా నవంబర్ కు పూర్తి అవుతుందని, డిసెంబర్ నెలాఖరు నాటికి డేటా బేస్ మొత్తం సిద్ధం అంతుందన్నారు. జనవరి నుంచి సభ్యుల డేటా ప్రకారం ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామన్నారు. అమెరికాలో అయితే పౌరులకు యూనిక్ నెంబర్ ఉంటుందని, దాని ప్రకారం వారి సమాచారం సేకరించవచ్చని, ఇండియాలో అయితే ఆధార్ నంబర్ ద్వారా సమాచారం వస్తుందన్నారు. ఏదైనా పాలసీ చేయాలన్నా, పథకాలు అందించాలన్నా ప్రభుత్వం వద్ద పౌరుల సామాజిక, ఆర్థిక స్థితి ఎలా ఉందనే సమాచారం ఉంటే ఎవరికి ఏ పథకాలు అందించాలో అనేదానిపై పూర్తి అవగాహన ఉంటుందన్నారు. మెప్మా ఏపీ లో 2 లక్షల 78 వేల 407 స్వయం సహాయక సంఘాలున్నాయని అందులో మొత్తం సభ్యులు 28 లక్షల 56 వేల 651 మంది ఉన్నారన్నారు. గత ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన డేటా ప్రాసెస్ సరిగా జరగలేదన్నారు. దీనివల్ల సభ్యుల బ్యాంక్ అకౌంట్ లు, లోన్ వివరాలతోపాటు వారికి సంబంధించిన ఇతర డేటా సరిగా లేదన్నారు. అందుకే నిజమైన లబ్ధిదారులను గుర్తించి, సభ్యులకు సంబంధించిన సామాజిక, ఆర్థిక స్థితి గతులపై ఖచ్చితమైన డేటా తీసుకోవడం ద్వారా పేదరిక నిర్మూలనకు సహాయపడుతుందన్నారు. టిడ్కో ఇళ్లు నిర్మించిన చోటే వారు ఉపాధి పొందే విధంగా షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తే వారు పట్టణాలకు వచ్చే అవకాశం ఉండదని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఆవిధంగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వం అమరావతి రాజధాని పనులపై అశ్రద్ధ వహించిందని, అప్పట్లో ఇచ్చిన టెండర్లుకు కాలపరిమితి పూర్తి అయ్యిందని, అందుకే ఆ టెండర్లు రద్దు చేసి మరలా క్యాబినెట్ ఆమోదంతో టెండర్లు పిలుస్తామన్నారు. ఈ ప్రక్రియ అంతా నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు పూర్తి అయి, జనవరి నుంచి రాజధాని పనులు మొదలుపెడతామని మంత్రి నారాయణ తెలియజేశారు. వర్క్ షాపులో మెప్మా ఎండీ తేజ్ భరత్, అన్ని జిల్లాల పీడీ లు, ఇతర అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

## మమతల పందిరి సేవా సమితి కి యంగ్ ఇండియన్ సేవా పురస్కారం



హనుమాన్ జంక్షన్ : అక్టోబర్ 30 మనం న్యూస్కృష్ణాజిల్లా వీరవల్లికి చెందిన లంక రమేష్ కు యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ -2024 యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమం లో ముఖ్య అతిథి తెలంగాణా ఆర్ టి సి మేనేజింగ్ డైరెక్టర్ విసి. సజ్జనార్ ఐ పి ఎస్ అందించటం జరిగిందని క్లబ్ అధ్యక్షులు జె.బాలు తెలిపారు.ఈ సందర్భంగా జేబి బాలు మాట్లాడుతూ లంక రమేష్ ల పందిరి సేవా సమితి ద్వారా సమాజ సేవ చేస్తూ,దేశ వ్యాప్తంగా ఉన్న మమతల పందిరి సేవా సమితి గ్రూప్ సభ్యులని మరియు యువత ను సమాజ సేవలో భాగస్వామ్యం చేస్తూ రక్త దాన శిబిరాలు నిర్వహించడం, వారికి రక్త దానం వైపు ప్రోత్సహించుట, అన్నదానం, వస్త్ర దానం, చలివేంద్రం, దుప్పట్లు పంపిణీ, చెప్పులు పంపిణీ, సామూహిక సీమంతాలు, చదువుకునే నిరుపేద పిల్లలకి ఓణీల ఫంక్షన్స్, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం వంటి పలు సేవలు మరియు సమాజ సేవలో భాగస్వామ్యం చేస్తున్నందుకు గాను ఈ అవార్డు అందిచటం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గ్రూప్ చేస్తున్న సేవలు గుర్తించి మమతల పందిరి సేవా సమితికి ఈ అవార్డు ఇవ్వటం హర్షణీయం అన్నారు. ఈ కార్ర్యమంలో మెడిది సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడిది వెంటేశ్వర రావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మమతల పందిరి సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు హర్షణీయం అని, అలాగే గ్రూప్ సభ్యులు అందరినీ ఒకే తాటి మీద నడిపిస్తూ ఇన్ని సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయం అని అన్నారు .అలాగే గత నెల గ్రూప్ కి లిసేవా నిరతి”అవార్డు రావడం ఇప్పుడు నేషనల్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు.అలాగే గ్రూప్ అడ్మిన్ టీం మరియు సభ్యుల సహకారం తో ఇలాంటి అవార్డులు ఎన్నో మరెన్నో ఈ మమతల పందిరి గ్రూప్ నీ వరించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

## అడపా బాల రవి కిరణ్, దివ్యా ల కుమార్తె బ్రిందా కృష్ణ పుట్టిన రోజు వేడుకలు



హనుమాన్ జంక్షన్ : అక్టోబర్ 30 మనం న్యూస్శేరినరసన్నపాలెం మాజీ సర్పంచ్,ఎం పి. టి సి మాజీ సభ్యులు అడపా యుగంధర రావు, కాశీ అన్నపూర్ణ మనుమరాలు బ్రిందా కృష్ణ పుట్టినరోజు వేడుకలను హనుమాన్ జంక్షన్ లో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ రాయల హంపి కళ్యాణ మండపంలో అత్యంత భారీ గా నిర్వహించిన ఈ వేడుక లకు పలువురు ప్రముఖుల తరలివచ్చారు. బ్రిందా కృష్ణ మొదటి పుట్టినరోజు కావడంతో ఏర్పాట్లు ఘనంగా చేశారు. స్వీట్ కాండీ, చాక్లెట్ కాండీ, మొక్టైల్ వంటి వినూత్న స్నాక్స్ ఏర్పాటు చేయడంతో పిల్లలు, పెద్దలు వాటిని రుచి చూసేందుకు బారులు తీరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మేజిక్ షో ఆకర్షణగా నిలిచింది. అనంతరం డి జే కేరింతలు పిల్లల డాన్సులు నడుమ బ్రిందాకృష్ణ చేత యుగంధర రావు, కాశీ అన్నపూర్ణ దంపతులు, అడపా బాల రవికిరణ్, దివ్యా దంపతులు కేకు కట్ చేయించారు. ఆ తర్వాత వివిధ రకాల మాంసాహార వంటకాలతో ఏర్పాటు చేసిన విందు ఆహుతులను వహ్వా అనిపించిందిశేరీనరసన్నపాలెం, కె. సీతారాంపురం , హనుమాన్ జంక్షన్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రముఖులు జన్మదిన వేడుకలకు తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## దీపావళి శుభకాంక్షలు తెలిపిన ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట అక్టోబర్ 30 మనం న్యూస్దీపావళిని పురస్కరించుకుని తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అన్నారు. దీపావళి సందర్భంగా తెలుగు ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు విజయాలు కలగాలని ప్రజలందరి జీవితాలు శోభాయమానంగా వెలుగొందాలని ప్రతి ఇంట ఆనంద కాంతులు విరజిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపిడిఓ.



పోలవరం, అక్టోబర్ 30(మనం న్యూస్ ): మండలంలో స్థానిక బాపూజీ కాలనీలో ఎస్సి హాస్టల్ సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి పోలవరం ఎంపిడిఓ శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరులక్షల నిధులతో కల్వర్టు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఎంపిడిఓ అన్నారు.గ్రామాభివృద్ధిలో భాగంగా కల్వర్టు నిర్మాణం, కొత్త పేటలో డ్రైన్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపిడిఓ తెలిపారు.స్థానిక ఏటిగట్టు బస్ కాంప్లెక్స్ వెనుక ప్రయాణికులను బాత్ రూమ్ లు త్వరలో మొదలు పెడుతున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంగిన కొండ,మాజీ వార్డు మెంబర్ పట్నాల నారాయణ, తెలుగుదేశం నాయకులు ఆకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

## కార్తీకమాసం పుణ్యస్నానాల రేవులు ఏర్పాటు..

**అధికారికంగా సిద్ధం చేసిన ర్యాంపుల వద్ద మాత్రమే భక్తులు స్నానాలు చేయాలి.. సర్పంచ్ పొడుం పుష్ప**



పోలవరం అక్టోబర్ 30 (పోలవరం, అక్టోబర్ 30,(మనం న్యూస్): కార్తీకమాసం సందర్భంగా భక్తులు గోదావరి పుణ్యస్నానాలు ఆచరించేందుకు అణువుగా గోదావరి ర్యాంపులను రహదారిని జేసీబీ తో బుధవారం శుభ్రం చేయించి సిద్ధంగా ఉంచామని పోలవరం పంచాయతీ సర్పంచ్ పొడుం పుష్ప తెలిపారు.పోలవరం మండలం పోలవరం గ్రామపంచాయతీ పరిధిలో పెద్ద రామాలయం వీధి, చిన్న రామాలయం వీధి, నూతన గూడెంలో రెండు చోట్ల, కృష్ణారావు పేటలో ఒక చోట భక్తులు గోదావరి స్నానాలు ఆచరించేందుకు అణువుగా ర్యాంపులను సిద్ధం చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఆయా రేవుల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున, లోతుగా ఉన్నందునఅధికారికంగా సిద్ధం చేసిన ర్యాంపుల వద్ద మాత్రమే భక్తులు స్నానాలు చేయాలని సర్పంచ్ కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాంపులనుసర్పంచ్ పొడుం పుష్ప,, జనసేన నాయకులు కొణతాల ప్రసాద్,వార్డు సభ్యులు మంగినకొండ, కోడి పోసి, ఉడతా గణేష్, తదితరులు పరిశీలించారు..

## భారీ వర్షానికి రహదారులు జలమయం



ముదినేపల్లి , అక్టోబర్ 30 మనం న్యూస్ : కుండపోత వర్షం కారణంగా ప్రధాన రహదారులు , అంతర్గత వీధులు జలమయం అయ్యాయి. ముదినేపల్లి , వడాలి- సింగరాయపాలెం , గురజ సెంటర్ , గుడ్లవల్లేరు రోడ్డు జలమయం అయ్యాయి. ముదినేపల్లి , సింగరాయపాలెం , అల్లూరు గ్రామాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా ఎడతెరిపి లేకుండా వచ్చిన వర్షంవలన వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరోజు సమయంలో షాపులు ఏర్పాటు జరగకపోవడం కొనుగోళ్లు ఎంతమేర జరుగుతోందని ప్రశ్నార్ధకంగా ఉందని వ్యాపారులు పేర్కొన్నారు. ముదినేపల్లి మండలంలో డ్రైనేజీ వ్యవస్థ సరి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు.

## వృద్దాశ్రమంలో అన్నదానం కార్యక్రమం.

**జనసేన మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కూటమి నాయకులు.**



పోలవరం అక్టోబర్ 30 (మనం న్యూస్)జనసేన పోలవరం మండల అధ్యక్షులు గుణపర్తి వీర వెంకట సత్యనారాయణ ( చిన్ని) పుట్టినరోజు సందర్భంగా బుధవారం పోలవరం మండల కేంద్రంలో గోదావరి నిలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుణపర్తి చిన్ని పాల్గొని జనసైనికులుతో కలిసి వృద్ధులకు భోజనాలు వడ్డించారు. కొత్తపట్టిసీమ గ్రామంలో జనసైనికులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలవరం జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తెలగంశెట్టి రాంప్రసాద్, మండలం ప్రధాన కార్యదర్శి చీకట్ల సాయికృష్ణ మూర్తి,కొత్తపట్టిసీమ గ్రామ కమిటీ అధ్యక్షులు నాగిరెడ్డి నాగేశ్వరరావు, టి డి పి నాయకులు ధవళ వీరన్న, వలవల శ్రీను, మొగలతుర్తి నాగేంద్ర,కోడి శ్రీను, జనసేన నాయకులు వలవల చిట్టియ్య,పోసియ్య,కొలపల్లి మణికంఠ,గంటా విష్ణు, చింతా రాము , చింతా శ్రీను,గంటా రంగయ్య తదితరులు మండల అధ్యక్షులు గుణపర్తి చిన్నికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## సి.ఐ.డి అధికారులు ఆకస్మిక తనిఖీలు





తాళ్లపూడి, 30 అక్టోబర్ (మనం న్యూస్)తాళ్లపూడి మండలం లోని తుపాకులగూడెం రెవిన్యూ పరిధి లో గల రెండు బ్రేవరేజ్ ఫ్యాక్టరీలపై ఏకకాలం లో సి.ఐ.డి అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటల సమయానికి రెండు టీమ్ లుగా రెండు ఫ్యాక్టరీల్లోకి సీఐడీ అధికారులు వెళ్లారు. విజయవాడ కు చెందిన సీఐడీ అధికారులు హఠాత్తుగా తనిఖీలు చేపట్టడం కేప్రికార్న్ డిస్టేరీ ప్రైవేట్ లిమిటెడ్, బి9 బ్రేవరేజిస్ లిమిటెడ్ ఫ్యాక్టరీ లలో సీఐడీ తనిఖీలు సాయంత్రం వరకు కొనసాగాయి. తనిఖీలు ఏకకాలం లో జరగటం విశేషం.

### దీపం -2, దీపావళి బాణసంచా
## షాప్స్, పింఛన్లు పంపిణీ పై సమావేశం



అల్లవరం: అక్టోబర్ 30 మనం న్యూస్ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు కు నవంబర్ 1 న మండలంలో 23 సచివాలయం ల లో పంపిణీ చేయవలసిన 9332 పింఛన్లు ఉదయం 6 లోపు ప్రారంభం చేసి సాయంత్రానికి 100% పంపిణీ పూర్తి చేయాలని సొమ్ము ఈ రోజు బ్యాంకు నుండి పూర్తిగా విత్ డ్రా చేసుకోవాలని ఎటువంటి ఇబ్బందులు లేకుండా 1 వ తేదీ పంపిణీ చేయాలనిదీపావళి బాణసంచా కాల్చి న చోట మరుసటి రోజు ఉదయం పారిశుధ్య నిర్వహణ చేయాలని, అగ్ని ప్రమాదాలు జరగ కుండా జాగ్రతలు చేపట్టేలా షాప్ యజమానులకు తెలియచేయాలని దీపం - 2 అర్హతలు , ఉచిత సిలిండర్ ల పై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కార్యదర్శులు కు అదేశాలు జారీ చేశారు ఈ సమావేశంలో ఎంపిడిఓ బి కృష్ణ మోహన్, తహసీల్దార్ ఎస్ వి నరసింహ రావు, ఏ ఎస్ ఐ కార్యదర్శులు రాజ్ మోహన్, శ్రీనివాస్ సత్యనారయణ రవి రాజు మల్లయమ్మ పాల్గొన్నారు

## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది సివిల్ సప్లై

**రాష్ట్ర డైరెక్టర్ మోకా ఆనంద్ సాగర్**



అమలాపురం అక్టోబర్ 30 మనం ప్రతినిధి అంబేద్కర్ కోనసీమ జిల్లా సివిల్ సప్లై ఆఫీస్ నందు, కొత్తపేట డివిజన్ రైతు సేవా కేంద్రాల ధాన్యం కొనుగోలు సిబ్బంది శిక్షణా తరగతులు నిర్వహించారు కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ మోకా ఆనంద్ సాగర్ పాల్గొని ప్రసంగించారు. రైతులను దళారుల చేతులలో మోసపో కుండా, రాష్ట్ర ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధరలు గురించి వివరించి, రైతులకు సిబ్బంది అండగా ఉండాలని, అన్నదాతలు సుభిక్షంగా ఉంటే రాష్ట్రం బాగుంటుం దన్నారు. ఈ సందర్భం గా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం బాల సరస్వతి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రైతు సేవ కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసు బాబు జిల్లా సహాయ మేనేజర్, నాగేశ్వరరావు అసిస్టెంట్ మేనేజర్ శిక్షణా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వి ఎస్ ఎం టెక్ పెస్ట్ ‘ లో శ్రీనివాసా
### అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ




కాట్రేనికోన అక్టోబర్ 30 మనం న్యూస్ అమలాపురం సమీపంలో చెయ్యేరు నందుగల శ్రీనివాసా అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల వి ద్యార్థులు ఇటీవల వి ఎస్ ఎం కళాశాల రామచంద్రపురం లో నిర్వహించిన ఎం ఏ ఆర్ ఎస్ ఎస్ 2కే 24 ఏ ఆర్ సి “ లో అత్యుత్తమ ప్రతిభకనబరిచి వివిధ విభాగములో ప్రథములుగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్ డా ఎం శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ, ఇటీవల వీసం కళాశాలలో నిర్వహించిన ప్రతిభాన్వేషణ పోటీలైన ప్రాజెక్ట్ ఎక్స్పో , టెక్నికల్ క్విజ్, రోబో రేస్ , మోడల్ మేకింగ్, కనస్ట్రక్షన్ విత్ కార్డ్స్ వంటి విభాగములు, మరియు ట్రెజర్ హంట్ యూస్ లెస్ టు యూజ్ వంటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ విభాగముల యందు విశేష ప్రావీణ్యము కనబరిచారని, ప్రతివిద్యాది. ఈ విధమైన సాంకేతిక ఉత్సవములు పాల్గొనుట ద్వారా పరిశీలానాత్మక ధోరణి అలవరుతుందని తద్వారా సృజనాత్మక దృక్పధము ద్వారా నూతన ఆవిష్కర్తులు. గా రూపొందవచ్చునని, విజేతలుగా నిలిచిన విద్యార్థుల్ని అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డి వి ఎన్ ఎస్ వర్మ, కళాశాల పాలకవర్గ సభ్యులు సందీప్ లు , సివిల్ విభాగాధిపతి ఎస్ .చక్రవర్తి కళాశాల విద్యాశాఖాధికారిణి డా౹౹ యస్. జయలక్ష్మి, విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బోరుబావి మోటార్ దొంగలను పట్టుకున్న చిల్లకల్లు పోలీసులు



పోలీసులను అభినందించిన నందిగామ ఏసిపి రవికిరణ్

జగ్గయ్యపేట అక్టోబర్ 30 మనం న్యూస్చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు మోటారు దొంగతనాల కేసును చిల్లకల్లు పోలీసులు చేదించారు .నిందితులను అదుపులోకి తీసుకొని మోటార్ల ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలోనందిగామ ఏసిపి రవికిరణ్ లో నిందితుల వివరాలను తెలిపారు. జగ్గయ్యపేట మండలంచిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న వరుస మోటార్ దొంగతనాలు గురించి పోలీస్ కమీషనరేట్ వారి ఆదేశాల మేరకపోలీస్ ఆధ్వర్యంలో సదరు ముద్దాయిల కోసం తీవ్రంగా గాలింపు చర్యలు జరుపుచుండగా బుధవారం చిల్లకల్లు సూర్య శ్రీనివాస్ వారి సిబ్బంది వద్ద నలుగురు వ్యక్తలను అదుపులోకి తీసుకొని వారిని విచారించగా సదరు వ్యక్తులు, జగ్గయ్యపేట మండలం, తిరుమలగిరి, బలుసుపాడు, పోచంపల్లి గ్రామాలలో బోరుబావి మోటర్లు దొంగలించి అమ్మటానికి పోతుండగా వారిని వద్ద ,వారి సిబ్బంధి సహాయంతో వారిని, వారి వద్ద వున్న మోటర్లను మద్యవర్తుల సమక్షంలో వశపరచుకొని, వారిని విచారించ గా నేరాలను అంగీకరించినట్లు తెలిపారు.వరస దొంగతనాలకు పాల్పదుతున్న పై ముద్దాయిలని చాకచక్యంగా అరెస్టు చేసి, ఏడు బోరుబావి మోటర్లు (విలువ సుమారు 1లక్ష 50 వేలు) చిల్లకల్లు సూర్య శ్రీనివాస్ మరియు సిబ్బదినీ నందిగామ ఏసిపి డా. రవి కిరణ్ అభినందించినారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకటేశ్వరరావు, చిల్లకల్లు సబ్ ఇన్స్పెక్టర్ సూర్య శ్రీనివాస్ ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సానిటేషన్ వర్కర్ పై చర్యలు తీసుకోవాలి
## గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశంలో సభ్యుల డిమాండ్.




గొల్లప్రోలు అక్టోబర్30. మనం న్యూస్. తోటి పారిశుద్యం సిబ్బందిపై అజమాయిసి చలాయిస్తూ సాధారణ వర్కర్ అధికారిలా చలామణి అవుతున్న ఎర్రంశెట్టి సత్యమోహన్ పై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం బుధవారం చైర్మన్ గండేటి మంగతాయారుఅధ్యక్షతన నిర్వహించారు ఈ సమావేశంలో గంటప్పల స్వామి గండేటి శ్రీరామచంద్రమూర్తిగొల్లసుబ్బారావు మాట్లాడుతూ శానిటేషన్ మేత్రిగా చలామణి అవుతున్న సత్య మోహన్ పట్టణ పరిధిలో కళ్యాణ మండపాల వద్ద నగర పంచాయతీకి చలానా కట్టాలంటూ ఒక్కొక్క కళ్యాణ మండపం నుండి2000. నుంచి.3000. రూపాయల వరకు వసూళ్లు కు పాలు పడుతున్నట్లు వసూళ్లు చేసిన సొమ్ములు నగర పంచాయతీకి జమ చేయడం లేదన్నారు పట్టణ పరిధి లో7 సచివాలయాలు సెక్రటరీలుఉండగా సాధారణ వర్కర్ పారిశుద్యంసిబ్బందిపై అజమాయిసిచేయటంఅవసరంఏముందని సభ్యులుప్రశ్నించారుపట్టణంపరిధిలో పారిశుద్ధ్యం నిర్లక్ష్యం చేస్తూకళ్యాణమండపాలవద్ద కె సిబ్బందినిటాక్టర్నుపంపిస్తున్నారనిఆరోపించారు అలాగేపారిశు ద్ధ్యంసిబ్బందివద్దనుండి ప్రతినెల సిబ్బందివద్దవేతనాలనుండికమిషన్ కూడా వసూళ్లు చేస్తున్నట్లు వివరించారు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సత్య సత్య మోహన్ ను విధులు నుండి తొలగించాలంటూ సమావేశంలో కమిషనర్ను సభ్యులు కోరారు అంతకుముందు వరద సహాయ నిమిత్తములక్ష రూపాయలు ఖర్చు చేసినట్లు ఏ జెండాలో పొందుపరచడంతో బిల్లులు చూపెట్టాలని కౌన్సిల్ సభ్యులు నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్ రావు పై ఆ ఆగ్రహం వ్యక్తపరిచారు దీనిపై నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్ రావు బిల్లులను చూపించారు పట్టణంలో వీధి దీపాలకు చూపించినటువంటిబిల్లులనుసభ్యులుతిరస్కరించారువీధిదీపాలుటెండ ర్లద్వారానే ఏర్పాటు చేయాలనిగతంలోనేతీర్మానించినట్లు స్పష్టంచేశారుఈసమావేశంలో సభ్యులుగొల్లపల్లి అచ్యుతాంబ వైస్ చైర్ పర్సన్ తెడ్ల పూ అఖిల్ యా రాణి గంధం నాగేశ్వరరావు మైనం భవాని తదితరులు పాల్గొన్నారు..

## వెలివెల లో పౌర హక్కుల దినోత్సవం




పాలకొల్లు, అక్టోబర్ 30, మనం ప్రతినిధి::మండలం లోని వెలివెల గ్రామం లో సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమ%శీ%లో రెవెన్యూ డిపార్ట్మెంట్ తరపున సూపరిండెంట్, డిప్యూటీ తహసీల్దార్ వై . నరేష్ కుమార్ , మండల పరిషత్ తరపున మండల విద్యాశాఖాదికారి శర్మ , పోలీసు డిపార్ట్మెంట్ తరపున రైటర్ మూర్తి , హౌసింగ్ డిపార్ట్మెంట్ తరపున ఏఈ శ్రీనివాస్ , ఆర్ డబ్ల్యు డిపార్ట్మెంట్ తరపున ఏఈ సురేష్ బాబు , , మండల తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ పాముల రజని, సభ్యులు, మండల నాయకులు , తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు, తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా అమలాపురం డిపో నుండి పంచారామ ప్రత్యేక బస్సులు



అమలాపురం అక్టోబర్ 30 మనం ప్రతినిధి పవిత్ర కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం ఎ.పి.యస్.ఆర్.టి.సి, అమలాపురం నుండి ప్రత్యేక బస్సులు నడుపబడుచున్నవని, వీటిలో భాగంగా నవంబర్ నెలలో ప్రతీ ఆదివారం రాత్రి 7.00 గం.ల కు అనగా 3,10,17, మరియు 24 తేదీలలో పంచారమ క్షేత్రాలకు స్పెషల్ బస్సులు ఆపరేట్ చేయబడునని, వీటి టికెట్ ధరలు ఎక్స్ప్రెస్ నకు రు.950, అల్ట్రా డీలక్స్ నకు రు.1170, సూపర్ లగ్జరీ నకు రు.1220 గా వున్నవని బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉన్నచో ఏ రోజైనా బస్సు ఆపరేట్ చేయబడునని, వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కలదని తెలిపారు. ఇంతే కాకుండా అయ్యప్ప స్వామి భక్తుల కొరకు శబరిమలై ప్రత్యేక బస్సులు నడుపడునని, మన్యసీమ మరియు తదితర టూరు ప్యాకేజీ బస్సులు నడుపబడునని, కాబట్టి ప్రయాణికులు ఈ సదావకాశం వినియోగించుకోవలసినదిగా అమలాపురం డిపో మేనేజర్ సి హెచ్ ఎస్ ఎన్ మూర్తి తెలియజేశారు..

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్.. డీఏ పెంపు ఉత్తర్వులు జారీ




దీపావళి పండుగ సందర్భంగా ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 3.64 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఏ పెంపు 2022 జులై ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని తెలిపింది.నవంబరు జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపులు చేయనున్నారు. 2022 జులై ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 వరకు డీఏ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు.2025 మార్చి 31వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు డీఏ బకాయిలు 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిలు 10 శాతం ప్రాన్ ఖాతాకు జమ చేస్తారు. 90 శాతం 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నారు. జీపీఎఫ్ ఖాతాలు లేని ఫుల్ టైం కంటింజెంట్ ఉద్యోగులకు 2025 ఫిబ్రవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేపడతారు. విశ్రాంత ఉద్యోగులకు డీఏ బకాయిలు 2025 జనవరి నుంచి 17 సమాన వాయిదాల్లో చెల్లింపులు చేయనున్నట్టు ప్రభుత్వం తెలిపింది.